సాక్షి సంగారెడ్డి

సోమవారం । 31 । మార్చి । 2025



సత్తా చాటిన ఆణిముత్యాలు

టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ 1 ఫలితాల్లో ఉమ్మడి మెదక్ వాసులు ప్రతిభ కనబరిచారు. వివరాలు 8లో ▸



ఒక్కో నిరసనకు ఒక్కో రిబ్బన్

సందేహాలకు, సంతాపాలకు, నిరసనలకు, అవగాహనలకు ఒక్కో రంగు రిబ్బన్ వాడుతున్నారు. వివరాలు 8లో ▸



ఘనంగా ఉగాది వేడుకలు

జిల్లా వ్యాప్తంగా ప్రజలు ఉగాది వేడుకలు ఘనంగా జరుపుకున్నారు వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

రంజాన్ వేడుకలకు సిద్ధం



విద్యుద్దీపాల కాంతుల్లో మసీదు

సంగారెడ్డి జోన్/జహీరాబాద్ టౌన్: జిల్లాలో రంజాన్ పండుగ వేడుకలు జరుపుకునేందుకు సర్వం సిద్ధం అయింది. మండల కేంద్రాలతో పాటు వివిధ గ్రామాల్లో నేడు రంజాన్ పండుగ సంబరాలు జరుపుకోనున్నారు. పండుగను పురస్కరించుకుని గ్రామాల్లోని మసీదులు విద్యుద్దీపాల కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. ముస్లిం సోదరులు ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఉదయం 9 గంటల సమయంలో మత పెద్దల ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహిస్తారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకుంటారు.

జహీరాబాద్ ఈద్గా ముస్తాబు...

జిల్లాలో అతి పెద్దదైన జహీరాబాద్ ఈద్గా ప్రార్థనలకు ముస్తాబైంది. ఇక్కడ ఒకేసారి సుమారు 25 వేలమంది ప్రార్థనలు చేసుకునేందుకు వీలుంది. ఇప్పటికే ప్రార్థనల కోసం ఈద్గా వద్ద అన్ని ఏర్పాట్లు చేశారు. పోలీసు, మున్సిపల్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రంజాన్ పండుగ షాపింగ్ కోసం ప్రజలు మార్కెట్‌కు రావడంతో ఆదివారం పట్టణంలో సందడి కనిపించింది.

ఘనంగా ఉగాది వేడుకలు



శ్రీ రామాలయంలో భజన పాటలు పాడుతున్న జగ్గారెడ్డి

ఝరాసంగం(జహీరాబాద్)/సంగారెడ్డి/రామచంద్రాపురం (పటాన్‌చెరు): తెలుగు నూతన సంవత్సరం ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం మండల కేంద్రమైన ఝరాసంగంతోపాటు వివిధ గ్రామాల్లో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఇండ్లల్లో ప్రత్యేక పూజలు పచ్చడి తయారు చేశారు. సాయంత్రం సమయాల్లో శ్రీ కేతకీ సంగమేశ్వర ఆలయంతోపాటు దత్తగిరి ఆశ్రమంలో పంచాగ పఠనం చేశారు.

సంగారెడ్డిలో...

జిల్లా కేంద్రం సంగారెడ్డిలో కన్నుల పండువగా జరిగింది. జిల్లా కేంద్రం సంగారెడ్డితోపాటు జిల్లాలోని అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగారెడ్డి పాత బస్టాండ్ వద్ద ఉన్న రామాలయంలో రాత్రి నిర్వహించిన మొరుండల కార్యక్రమం అందరినీ ఉత్సాహపరిచింది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి కుటుంబ సభ్యులతో కలసి రామాలయంపై నుంచి ప్యాలాలతో చేసిన మొరుండలను ప్రజల్లోకి విసరగా వాటిని అందుకోవడానికి జనం పోటీపడ్డారు.

రామచంద్రాపురంలో...

రామచంద్రాపురం,భారతీనగర్ డివిజన్, బీహెచ్ఈఎల్ టౌన్‌షిప్‌లో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలు ఆలయాలలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎంఐజీ కాలనీలో శ్రీలత, స్వరూప ఆధ్వర్యంలో చేపట్టిన ఉగాది పచ్చడి పంపిణీ కార్యక్రమంలో కార్పొరేటర్ సింధు రెడ్డి పాల్గొన్నారు.హనుమాన్ ఆలయంలో పంచాంగ శ్రవణం కార్యక్రమాన్ని నిర్వహించారు.

నేటితో ముగియనున్న ఓటీఎస్ పథకం



కమిషనర్ మధుసూదన్ రెడ్డికి చెక్కును అందజేస్తున్న పరిశ్రమ యాజమాన్యం

జిన్నారం (పటాన్‌చెరు): ఈ నెల 31 తో ఒన్ టైమ్ సెటిల్‌మెంట్ (ఓటీఎస్) పథకం ముగియనుందని బొల్లారం మున్సిపల్ కమిషనర్ మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం సైతం అధికారులు అందుబాటులో ఉండి పన్నులు వసూలు చేశారు. పారిశ్రామికవేత్తలు, గృహ యజమానులు ముందుకు వచ్చి 90% వడ్డీ రాయితీతో పనులు చెల్లించారు. మెడ్రిచ్ లిమిటెడ్ పరిశ్రమ రూ.5,93,280 , ఎస్డీ స్టీల్ ఇండస్ట్రీస్ రూ.1,82,002, విజేత ఎంటర్‌ప్రైజెస్ రూ.3,01,898 ఆస్తి పన్ను బకాయిలను చెక్కు రూపంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డిని కలిసి అందజేశారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ...ఇప్పటివరకు 13.75 కోట్ల ఆస్తి పన్నులు వసూలు చేశామన్నారు.

సదా చెత్త పేట



సదాశివపేట మున్సిపాలిటీగా ఏర్పడి ఏడు దశాబ్దాలు దాటినా అక్కడ అభివృద్ధి మాత్రం కానరావడంలేదు. మున్సిపల్ అధికారుల అలసత్వం, పారిశుద్ధ్య సిబ్బంది నిర్లక్ష్యం వెరసి మున్సిపాలిటీ అంతటా చెత్తా చెదారంతో దుర్గంధం వెలువడుతోంది. చిరువ్యాపారులు రోడ్లపైనే వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో రోడ్లన్నీ ఇరుకుగా మారి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఇంటి చెత్త సేకరించకపోవడం, వీధి దీపాలు సరిగ్గా వెలగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇంత జరుగుతున్నా మున్సిపల్ అధికారులు అలసత్వం వీడటం లేదు. దీంతో సదా శివపేట కాదిది సదా చెత్తపేటగా విమర్శిస్తున్నారు స్థానికులు.

సాక్షి పరిశీలన

సదాశివపేట(సంగారెడ్డి): మున్సిపాలిటీగా ఏర్పడి 72 ఏళ్లు గడుస్తున్నా అభివృద్ధికి మాత్రం ఆమడదూరంలో నిలిచింది. పట్టణ ప్రధాన రహదారుల గుండా అప్పుడప్పుడూ పారిశుద్ధ్య పనులు జరుగుతుండగా పట్టణ పరిధిలోని అన్ని కాలనీలు మాత్రం చెత్తకుప్పలు, మురుగు డ్రైనేజీలతో దర్శనమిస్తున్నాయి. పారిశుద్ధ్యలోపంతో ఈగలు, దోమలు స్వైరం విహారం చేస్తున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. వేలకు వేల రూపాయల పన్నులు వసూలు చేస్తున్నారే కానీ కాలనీల అభివృద్ధిని మాత్రం విస్మరిస్తున్నారు. చాలా కాలనీల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నాయి. పారిశుద్ధ్య కార్మికులు వీధులకు ఎప్పుడు వస్తారో తెలియడంలేదు.

పన్నులు సరే పారిశుద్ధ్యమేది

- అస్తవ్యస్తంగా డ్రైనేజీలు
- ఈగలు దోమల స్వైర విహారం
- రోగాల బారిన పడుతున్న ప్రజలు
- తూతూమంత్రంగానే పర్యవేక్షణ

మున్సిపాలిటీ ఏర్పాటు	1953
పట్టణంలోని వార్డులు	26
పట్టణ జనాభా	71,240
గృహాలు	14,214
రెవెన్యూజోన్లు	7
అవసరమైన తాగునీరు	4.08 ఎంఎల్‌డీ
మంచినీటి పథకం	మిషన్ భగీరథ
తాగునీటి సరఫరా పైప్‌లైన్	134 కిలోమీటర్లు
మురుగునీటి కాలువలు	131- కిలోమిటర్లు
ట్రేడ్ లైసెన్సులు	1,019
చెత్తసేకరణ వాహనాలు	17
రోజు చెత్త సేకరణ	21 మెట్రిక్ టన్నులు
పారిశుద్ధ్య కార్మికులు	127
మహిళా గ్రూపులు	624



ఈదులవాగు వద్ద చెత్తకుప్పలు

డంపింగ్‌యార్డ్ ఉన్నా ప్రయోజనమేది?

ఎన్కెపల్లి రోడ్డులో ఉన్న డంపింగ్‌యార్డ్ ఉన్నా అక్కడ పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను వేయడం లేదు. ఇదులవాగు పక్కన, రోడ్ల పక్కన ఖాళీ ప్రదేశాల్లో చెత్తను సేకరించే పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను పడవేస్తున్నారు. డంపింగ్‌యార్డులో చెత్త నిలవ చేస్తున్నా ఎరువులు తయారు చేయడం లేదు.

పనిచేయని ట్రాఫిక్ సిగ్నల్స్

పట్టణంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ రెండేళ్లుగా పనిచేయడం లేదు. లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థ పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేకపోవడంతో వాహనదారులు ఇష్టానుసారంగా వెళ్తుండటంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

ఇరుకు రహదారులు

పట్టణంలోని ప్రధాన రహదారులైన శాస్త్రీరోడ్డు, సుభాష్‌రోడ్డు, తిలక్‌రోడ్డు, గాంధీచౌక్, బుక్కకేరీల్లో ప్రధాన రోడ్లు ఇరుకుగా మారాయి. ఫుట్‌పాత్‌ను వ్యాపారులు కబ్జా చేసి వ్యాపారాలు నిర్వహించడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. ఈ రోడ్ల గుండా ప్రయాణించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

కాలనీల్లోనే సమస్యలు అధికం

రహమత్‌నగర్, ఫయాజ్, రాఘవేంద్రనగర్, శ్రీరామ నగర్, ప్రియదర్శని, దత్తాత్రేయ, శంభులింగేశ్వర,హనుమాన్, సిద్దాపూర్, డబుల్‌బెడ్రూం, సాయినగర్,రాఘవేంద్ర, గురునగర్,మహ్మదీయ, ఎవరెస్ట్ తదితర కాలనీల్లోనే అంతర్గత కచ్చారోడ్లు, కచ్చా డ్రైన్లు, వీధిలైట్లు, ఖాళీ స్థలాల్లో చెత్తకుప్పలు, ముళ్లపొదలు, మురుగునీటితో దుర్గంత భరితమైన వాతావరణం వంటి సమస్యలతో ప్రజలందరూ ఇబ్బందులు పడుతున్నారు.

చెత్తసేకరణలో నిర్లక్ష్యం

పట్టణంలో ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడం లేదు. దీంతో చెత్తను ప్రజలు ఇండ్ల సమీపంలో ఖాళీ ప్రదేశాల్లో పడవేస్తుండటంతో అపరిశుభ్ర వాతావరణం ఏర్పడుతోంది.



సదాశివపేట మున్సిపల్ కార్యాలయం

నిలిచిన ఇంటిగ్రేటేడ్ నిర్మాణం



నిలిచిపోయిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం

పట్టణంలోని మార్కెట్‌యార్డులో 11 కోట్ల నిధులతో నిర్మాణం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణ పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపివేశారు. దీంతో పట్టణంలో వారాంతపు సంతలు రోడ్లపైనే నిర్వహిస్తున్నారు. తైబజార్ ఫీజు వసూలు చేస్తున్న అధికారులు సంతల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదు.

రహదారులు అస్తవ్యస్తం



డివైడర్ నిర్మించకుండానే రోడ్డు నిర్మాణం

ప్రధాన రహదారులు మినహా చాలాచోట్ల రహదారులు గుంతలు పడి అధ్వానంగా తయారయ్యాయి. హౌసింగ్‌బోర్డు నుంచి సిద్దాపూర్‌గౌని వరకు, గొల్లకేరీ నుంచి యూసెఫ్ సెంటర్ వరకు రోడ్డు నిర్మించినా నిధులు విడుదల చేయనందువల్ల కాంట్రాక్టర్లు రోడ్డు మధ్యలో డివైడర్ నిర్మించలేదు. దీంతో ప్రతీరోజు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పరిష్కరించడంలో విఫలం



పట్టణంలో పారిశుద్ధ్యం, ఇంటింటి చెత్త సేకరణ, రహదారుల నిర్మాణాలు, వీధి దీపాలు, ఇతర సమస్యలు పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. కాలనీల్లో చెత్త కుప్పలు, ఇండ్ల మధ్య మురుగునీరు, కచ్చా రోడ్లు, కచ్చా డ్రైనేజీల సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పరిష్కరించాలి.

–నల్ల జయరాములుగౌడ్, మాజీ కౌన్సిలర్, సదాశివపేట

చెత్తబండి రావడం లేదు



రాఘవేంద్రనగర్ కాలనీలో ఇంటింటికీ చెత్తసేకరించే బండిరావడం లేదు. ఇంట్లోనే చెత్తను సంచుల్లో నిల్వచేస్తుండటంతో దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. డస్ట్‌బిన్లను ఏర్పాటు చేస్తే అందులో వేస్తాం. నిత్యం చెత్త సేకరణ వాహనం వచ్చేలా అధికారులు చర్యలు చేపట్టాలి.

–శశిమోహన్‌గౌడ్, రాఘవేంద్రనగర్, సదాశివపేట

ఎవరూ పట్టించుకోవడం లేదు.



డబుల్ బెడ్రూం కాలనీలో సమస్యల గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. డబుల్ బెడ్రూం కాలనీకి వెళ్లే మార్గంలో మురుగునీటి నిల్వతో దుర్గంధం ఏర్పడింది. మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారు. తరచూ నీటి సరఫరా పైప్‌లైన్ లీకేజీల కారణంగా నీటి సరఫరా నిలిచిపోతోంది.

–ప్రభాకర్, డబుల్ బెడ్రూం కాలనీ, సదాశివపేట

పరిష్కరిస్తాం



పట్టణ పరిధిలోని కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు, పారిశుద్ధ్య సమస్యలు, వీధి దీపాల సమస్యలతోపాటు ఇతర ప్రజా సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా. ప్రజలకు అందుబాటులో ఉంటా. ఫిర్యాదులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం.

– ఉమ, కమిషనర్ సదాశివపేట

అందరికీ శుభాలు కలగాలి

- మంత్రి పొన్నం ప్రభాకర్
- క్యాంపు కార్యాలయంలో ఉగాది వేడుకలు



పంచాంగ శ్రవణం కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్: నూతన తెలుగు సంవత్సరాది నుంచి అందరికీ శుభాలు కలగాలని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచాంగ శ్రవణం కార్యక్రమంలో మంత్రి పొన్నం దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మున్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉగాది వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు. షడ్రుచుల పచ్చడి, బక్ష్యాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మట్లాడుతూ సమృద్ధిగా పాడి పంటలతో అందరూ సుఖంగా జీవించాలన్నారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ప్రజలందరికీ మేలు జరిగేలా భగవంతుడి ఆశీర్వాదం అందాలని కోరా రు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆకుల రజిత, మాజీ కౌన్సిలర్లు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

మున్సిపల్ అభివృద్ధికి రూ.10 కోట్లు

మున్సిపల్ పరిధిలో వివిధ అభివృద్ధి పనులకు రూ.10 కోట్లు మంజూరైనట్లు సీడీఎంఏ శ్రీదేవి ఉత్తర్వులు జారీ చేశారు. చైతన్య పాఠశాల నుంచి పెట్రోల్ బంక్ వరకు సెంట్రల్ లైటింగ్ ప్లాంటేషన్ కోసం రూ.కోటి, మల్లెచెట్టు చౌరస్తా నుంచి ఎల్లమ్మ చెరువు వరకు రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్, డివైడర్ల నిర్మాణం కోసం రూ.5 కోట్లు మంజురయ్యాయి. అలాగే కొత్త చెరువు సుందరీకరణకు రూ.2కోట్లు, హుస్నాబాద్ మున్సిపల్ స్వాగత తోరణాల ఏర్పాటుకు రూ.1.20 కోట్లు మంజూరయ్యాయన్నారు. నూతన జంక్షన్ల అభివృద్ధి కోసం రూ.80 లక్షలు మంజూరయ్యాయి.

ప్లాస్టిక్‌ను నివారిద్దాం..

ప్లాస్టిక్‌ను నివారిద్దామని, స్టీల్ గ్లాసులు మేలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం పట్టణంలోని హోటల్ యాజమానులకు స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్లాస్టిక్ గ్లాస్‌లో చాయ్ తాగడం వల్ల అనారోగ్యాలకు గురవుతున్నామన్నారు. పట్టణంలో 50 హోటల్స్ ఉన్నాయని, ప్రతి హోటల్‌కు వంద గ్లాసుల చొప్పున పంపిణీ చేశామన్నారు. చిన్న గ్రామాల్లో 500 కిట్స్, పెద్ద గ్రామాల్లో 1000 కిట్స్ చొప్పున స్టీల్ బ్యాంక్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామాల్లో మహిళా సంఘాల ద్వారా నిర్వహిస్తామన్నారు.

అలరించిన కుస్తీ పోటీలు



కల్హేర్(నారాయణఖేడ్): ఉగాది ఉత్సవాల నేపథ్యంలో మండలంలోని మార్డిగ్రామంలో, సిర్గాపూర్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కుస్తీ పోటీలు విశేషంగా అలరించాయి. విజేతలకు నిర్వాహకులు నగదు బహుమతి అందజేశారు. చివరి కుస్తీ పోటీ విజేతకు వెండి కడియం అందజేశారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ప్రవాస భారతీయుడు గుర్రపు మశ్చేందర్, బీఆర్ఎస్ నాయకులు సంజీవరావు, మాజీ ఎంపీటీసీ రాజుకుమార్ సిగ్రె, తదితరులు పాల్గొన్నారు.



సంతాప ర్యాలీ



సంగారెడ్డి జోన్: ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాలకు సంతాపాన్ని తెలియజేస్తూ ఆదివారం యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం, సంగారెడ్డి నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలో శాంతిర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో యూసీఎఫ్ అధ్యక్షుడు రూబెన్ రెడ్డి, ఉపాధ్యక్షుడు డా.మధుమోహన్, జనరల్ సెక్రెటరీ సునీల్ జయ కుమార్ పాల్గొన్నారు.

జీవితాల్లో వెలుగులు నింపాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి




పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్, పట్టణ ప్రముఖులు

పటాన్‌చెరు/పటాన్‌చెరు టౌన్: శ్రీ విశ్వవసు నామ సంవత్సరం ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. ఉగాది పర్వదినం పురస్కరించుకుని ఆదివారం పటాన్‌చెరు పట్టణంలోని చైతన్యనగర్ హనుమాన్ దేవాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు రాశి ఫలాలను వివరించారు. అంతకుముందు రుద్రారం గ్రామ పరిధిలోని గణేష్‌గడ్డ సిద్ధి వినాయక దేవాలయం, పటాన్‌చెరు పట్టణ పరిధిలోని చైతన్యనగర్ హనుమాన్ దేవాలయాలను ఎమ్మెల్యే గూడెం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. కాగా, ఉగాదిని పురస్కరించుకుని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజయభాస్కర్ రెడ్డి, రామచంద్ర రెడ్డి,నర్ర బిక్షపతి, శంకర్, వెంకట్ రావు కలసి ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డిని తన నివాసంలో కలసి శుభాకాంక్షలు అందజేశారు.

బడుల్లోనూ ఏఐ బోధన

- ప్రయోగాత్మకంగా 33 పాఠశాలలు ఎంపిక
- వచ్చే విద్యా సంవత్సరం 346 పాఠశాలల్లో
- ఇంటర్‌నెట్‌తో కూడిన కంప్యూటర్ల ఏర్పాటు



నారాయణఖేడ్: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో ప్రభుత్వ పాఠశాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు బోధన అందనుంది. జిల్లాలో ఇలా 33 పాఠశాలలు ఏఐ బోధనకు అధికారులు ఎంపిక చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి జిల్లాలో మరో 346 పాఠశాలల్లో ఏఐ బోధన సాగనుంది. ఇందుకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. రానున్న యుగం ఏఐదే కావడంతో ఆ దిశగా ప్రభుత్వం, విద్యాశాఖ సమాయత్తం అవుతుంది. విద్యార్థులను సైతం ప్రాథమిక స్థాయి నుంచి ఏఐ బోధన చేపట్టి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు చర్యలకు ఉపక్రమిచింది.

33 పాఠశాలలు ఎంపిక

విద్యార్థుల్లో సామర్థ్యాలు మెరుగు పరిచేందుకు తొలి విడతలో ఏఐ బోధనకు 33 ప్రాథమిక పాఠశాలు ఎంపికయ్యాయి. ప్రాథమిక బాలికల పాఠశాల సంగారెడ్డి, ఎంపీపీఎస్ అమీన్‌పూర్, అన్నారం , ముత్తంగి, కొల్లాపూర్, క్రిష్టాపూర్, దోమడుగు, గొంగ్లూర్, కడ్పల్, హద్నూర్, అక్సాన్‌పల్లి, వావిలాల, కన్‌సాన్‌పల్లి, కంకోల్, అనంతసాగర్, నల్లవాగు, వెలిమెల, సత్వార్, గొట్టిగారిపల్లి, హస్నాబాద్, సింగీతం, పెద్దగోపులారం, బుదేరా, మల్లికార్జునపల్లి, తెర్పోల్, సి.కొండాపూర్, మంగంపేట్, పెద్దకంజర్ల, కొత్తూర్ (బి), శివ్వానగర్, తాటిపల్లి, పెద్దచెల్మెడ, సింగీతం పాఠశాలలను ఎంపిక చేశారు. ఈ పాఠశాలల్లో కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులను ఎంపిక చేసి వారికి శిక్షణ ఇచ్చారు. పాఠశాలల్లో ఇంటర్‌నెట్ సదుపాయంతో పాటు కంప్యూటర్లు, హెడ్‌సెట్‌లను ఏర్పాటు చేసి బోధిస్తున్నారు. ఈనెల 15 నుంచే 'ఏక్ స్టెప్'సంస్థ సహకారంతో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్ వినియోగిస్తూ ఇంగ్లిష్, గణితం పాఠశాలను విద్యార్థులకు బోధిస్తున్నారు.

మరో 346 పాఠశాలలు..

వచ్చే విద్యా సంవత్సరం (2025- 26) నుంచి జిల్లాలో 50మంది విద్యార్థుల చొప్పున ఉన్న మరో 346 పాఠశాలలను ఏఐ బోధనకు ఎంపిక చేయనున్నారు. 50మందికి పైగా విద్యార్థులు ఉన్న ప్రతీ ప్రాథమిక పాఠశాలకు 5 చొప్పున కంప్యూటర్లను సరఫరా చేసేందుకు విద్యాశాఖ నిర్ణయించింది. ఇవి వచ్చే జూన్ 1 నాటికి పాఠశాలలకు చేరుకోనున్నాయి. పిల్లల్లో అభ్యసన సామర్థ్యాలను పెంచే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. 1 నుంచి 5వ తరగతి వరకు గణితం సబ్జెక్టులో ఏఐ పాఠ్యాంశాన్ని కూడా చేరుస్తున్నారు. వచ్చే విద్యా ఏడాది నుంచి డిగ్రీలోని బీఏ, బీకాం విద్యార్థులకు ఏఐ బోధన చేపట్టేందుకు ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. వారికి ఏఐలో మెషీన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ, డేటా అనాలసిస్ వంటి కోర్సులను చదివించే విధంగా నిబంధనలను సవరించనున్నారు. కాగా, ప్రాథమిక విద్యాశాఖ కూడా ఒక అడుగు ముందుకువేసి ఈ ఏడాది నుంచే ఏఐ బోధనను ప్రయోగాత్మకంగా 33 పాఠశాలల్లో ప్రారంభించింది.

33 పాఠశాలల్లో ఏర్పాటు



జిల్లాలో కృత్రిమ మేధ (ఏఐ) బోధనకు 33 పాఠశాలలను ఎంపిక చేశాం. ప్రతీ పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని ఎంపిక చేసి శిక్షణ ఇచ్చాం. ప్రయోగాత్మకంగా ఈనెల 15 నుంచి ఏఐ బోధన ఆయా పాఠశాలల్లో చేపట్టాం. వచ్చే విద్యా సంవత్సరం 346 పాఠశాలల్లో ఏఐ బోధన ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

– బాలయ్య, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి (ఏఎంఓ), సంగారెడ్డి

క్లుప్తంగా

ఆనందయ్య మఠంలో చోరీ

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని బేగంపేటలో గల అనందయ్య మఠంలోని సౌండ్ సిస్టానికి చెందిన ఆంప్లీపయర్‌ను శనివారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లారు. రోజులానే ఆలయం తాళం చెవిని ప్రాంగణంలో పెట్టి వచ్చారు. ఆదివారం తెల్లవారు జామున వెళ్లేసరికి ఆంప్లీపయర్ కనబడలేదు. సుమారు 18 వేల విలువ ఉంటుందని కమిటీ సభ్యులు తెలిపారు. బెజ్జంకి పోలీసులకు సమాచారమివ్వగా విచారణ చేశారు. అలాగే ఆటో బ్యాటరీ సైతం చోరీకి గురైందని స్థానికులు తెలిపారు. తాళం చెవి తీసుకుని చోరీకి పాల్పడ్డారంటే తెలిసిన వ్యక్తులేనని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

గజ్వేల్‌రూరల్: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. గజ్వేల్ పోలీసుల కథనం ప్రకారం మండల పరిధిలోని అక్కారం శివారులో కొందరు పేకాట ఆడుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, గజ్వేల్ పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా 4 సెల్‌ఫోన్‌లతో పాటు రూ. 5,990 నగదును స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసు నమోదు చేశారు.

భక్తుల సెల్‌ఫోన్ అపహరించిన మహిళ

దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగింత

కొమురవెల్లి(సిద్దిపేట): భక్తుల సెల్‌ఫోన్‌లు అపహరించిన మహిళకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ పరిసరాల్లో చోటు చేసుకుంది. ఆదివారం కావడంతో ఆలయంలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దీన్ని ఆసరాగా చేసుకొని ఓ మహిళ ఓ భక్తుడి సెల్‌ఫోన్‌ను అపహరించేందుకు యత్నించగా అతడు అప్రమత్తమయ్యాడు. ఆమెను పట్టుకొని విచారించగా రెండు సెల్‌ఫోన్‌లు లభించాయి. దీంతో భక్తులు ఆమెకు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీస్ స్టేషన్‌కు తరలించి మందలించి వదిలిపెట్టినట్లు సమాచారం.

తండ్రిని చంపిన కొడుకు

గజ్వేల్‌రూరల్: తండ్రి, కొడుకు మధ్య నెలకొన్న వాగ్వాదంలో తండ్రిని కొడుకు చంపిన ఘటన గజ్వేల్ పట్టణంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని పటేల్‌బజార్‌కు చెందిన ఎండీ షాబొద్దీన్(47), రజియాబేగంలకు కొడుకు షాకేర్, కూతురు ఉన్నారు. శనివారం రాత్రి మద్యం మత్తులో ఉన్న షాబొద్దీన్‌కు, కొడుకు షాకేర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో వంటింట్లోకి వెళ్లిన షాబొద్దీన్ కిందపడటంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే భార్య అక్కడకు చేరుకొని అతడిని పక్కకు తీసుకెళ్లింది. అర్ధరాత్రి సమయంలో షాబొద్దీన్ నిద్రిస్తుండగా కొడుకు అతని మెడకు తాడును బిగించి చంపేందుకు ప్రయత్నించాడు. గమనించిన రజియాబేగం అడ్డుకోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయాడు. ఈ క్రమంలో షాబొద్దీన్ వద్దకు వెళ్లిచూడగా అతడు మృతి చెందినట్లు గుర్తించి చుట్టుపక్కల వారికి సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఒంటరి మహిళ దారుణ హత్య



లక్ష్మి(ఫైల్)

జహీరాబాద్ టౌన్: ఒంటరి మహిళను గుర్తు తెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ ఘటన జహీరాబాద్ పట్టణంలోని పస్తాపూర్‌లో చోటు చేసుకుంది. జహీరాబాద్ టౌన్ ఎస్ఐ.కాశీనాథ్ కథనం ప్రకారం... ఝరాసంగం మండలం చిలేమామిడి గ్రామానికి చెందిన లక్ష్మి(35)కి భర్త లేడు. ఆమె కొడుకు ఉండగా హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. ఉపాధి కోసం వచ్చిన ఆమె పస్తాపూర్‌లో అద్దె ఇంట్లో ఉంటుంది. ఆదివారం ఒంటరిగా ఉన్న సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటిలోపలికి చొరబడి ఆమెను చితకబాదారు. గ్యాస్ సిలిండర్‌తో తలపై కొట్టడంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. ఆమె మెడలో ఉన్న బంగారం తీసుకుని పారిపోయారు. విషయం తెలుసుకున్న జహీరాబాద్ డీఎస్పీ రాంమోహన్‌రెడ్డి, సీఐ.శివలింగం ఘటనా స్థలాన్ని సందర్శించారు. నిందితుల కోసం డాగ్ స్క్వాడ్‌ను రప్పించారు. మృతురాలి చెల్లెలు జయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఉద్యోగం చేస్తూనే ఆన్‌లైన్ కోచింగ్..



పూజ యాదవ్

సదాశివపేట రూరల్(సంగారెడ్డి): ఉన్నత విద్యా కుటుంబంలో పుట్టి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో గ్రూప్ 1లో రాష్ట్ర స్థాయిలో 26వ ర్యాంకు సాధించి యువతకు ఆదర్శంగా నిలుస్తోంది కప్పే పూజ యాదవ్. ఫలితాల్లో 509.5 మార్కులు సాధించింది. జహీరాబాద్ మండలంలోని చిన్న హైదరాబాద్ గ్రామానికి చెందిన దండు అలియాస్ కప్పే అంజయ్య (రిటైర్డ్ ఎంఈఓ), జయశ్రీ (ఎంఏ బీఎడ్)ల పెద్ద కూతురే పూజ యాదవ్. వీరు ప్రస్తుతం సంగారెడ్డి పట్టణంలోని ఆదర్శ్ జిమాక్స్ కాలనీలో నివసిస్తున్నారు. బీటెక్ పూర్తి చేసిన పూజ ఇప్పటికే గ్రూప్ -4 సాధించి గురుకుల పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తోంది. కాగా గ్రూప్స్‌కు ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకొని ప్రతిభ కనబర్చింది. సివిల్స్ లక్ష్యంగా ముందుకు సాగుతానని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

సత్తా చాటిన ఆణిముత్యాలు

టీజీపీఎస్సీ విడుదల చేసిన గ్రూప్ -1 ఫలితాల్లో ఉమ్మడి మెదక్ జిల్లా వాసులు ప్రతిభ కనబర్చారు. ఎన్ని అడ్డంకులు వచ్చినా లక్ష్యం పెట్టుకొని పట్టుదలతో చదివి ర్యాంకులు సాధించారు. ప్రభుత్వ ఉద్యోగానికి ఎంపిక కావడంతో తల్లిదండ్రులు, బంధువులు, గ్రామస్తులు అభ్యర్థులను అభినందించారు.

టీజీపీఎస్సీ గ్రూప్-1 ఫలితాల్లో హవా

- ఉమ్మడి జిల్లాలో ఆరుగురు ఎంపిక
- 26వ ర్యాంకు సాధించిన పూజ
- 41వ ర్యాంక్ సాధించిన శైలేష్
- ముసాపేటకు చెందిన ప్రభాత్‌రెడ్డికి 73వ ర్యాంక్
- 75వ ర్యాంకు సాధించిన సిద్దిపేట వాసి నర్ర అఖిల్
- మిర్జాపూర్(బి)కు చెందిన అఖిలజారెడ్డికి 125 ర్యాంక్

కోచింగ్ తీసుకోకుండానే..



పూన శైలేష్

మెదక్‌జోన్ : టీజీపీఎస్సీ ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో మెదక్ పట్టణానికి చెందిన పూన శైలేష్ 41వ ర్యాంక్ సాధించాడు. ఇటీవల ప్రకటించిన ఫలితాల్లో 503.500 మార్కులు వచ్చాయి. 1 నుంచి 7వ తరగతి వరకు మెదక్‌లోని శివ సాయి, 8 నుంచి 10 తరగతి వరకు అభ్యాస ఇంటర్నేషనల్ స్కూల్ తూప్రాన్, ఇంటర్మీడియట్ నారాయణ ఐఏఎస్ అకాడమీ హైదరాబాద్, డిగ్రీ ఢిల్లీ యూనివర్సిటీలో చదివాడు. ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ఈ ర్యాంకు సాధించడం విశేషం. తండ్రి పూన రవి పట్టణంలో బంగారం నగల దుకాణం నడిపిస్తాడు. ఈ సందర్భంగా శైలేష్‌ను పలువురు అభినందించారు.



అఖిల్‌ను అభినందిస్తున్న తల్లిదండ్రులు

తల్లిదండ్రుల ప్రోత్సాహంతో..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదివారం ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో సిద్దిపేట పట్టణానికి చెందిన నర్ర అఖిల్ 75వ ర్యాంక్ సాధించాడు. పట్టణానికి చెందిన నర్ర భగవాన్ రెడ్డి, వజ్రమ్మల మొదటి కుమారుడు అఖిల్. రాష్ట్ర ఏర్పాటు తరువాత తొలిసారిగా నీటిపారుదల శాఖ పరీక్షల్లో ప్రతిభ కనబర్చి ఏఈఈగా నియామకమయ్యారు. తాజాగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన గ్రూప్-1 ఫలితాల్లో అఖిల్ 75వ ర్యాంక్ సాధించాడు. కష్టపడి చదివితే ఏదైనా సాంధించవచ్చని అఖిల్ పేర్కొన్నాడు. తన తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చదివానని ఆయన తెలిపారు. ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని చెప్పాడు.

పట్టుదలతో చదివి..



ఎరగారి ప్రభాత్‌రెడ్డి

పెద్దశంకరంపేట(మెదక్): పెద్దశంకరంపేట మండలం ముసాపేట గ్రామానికి చెందిన ఎరగారి ప్రభాత్‌రెడ్డి గ్రూప్-1లో రాష్ట్ర స్థాయిలో 73వ ర్యాంకు సాధించాడు. గ్రామానికి చెందిన ఎరగారి శశింధర్‌రెడ్డి , పావనీలకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు ప్రభాత్ రెడ్డి గత రెండు నెలల క్రితం వెల్లడైన గ్రూప్-4 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ సాధించి ప్రస్తుతం జిల్లాలోని కొల్చారం మండలం రెవెన్యూ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయన విద్యాభ్యాసం మెదక్‌లోని సిద్దార్థ మోడల్‌స్కూల్‌లో 10 వ తరగతి వరకు చదువుకున్నాడు. ఇంటర్ పూర్తి చేసి హైదరాబాద్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ చదివారు. మూడేళ్లుగా అశోక్ నగర్‌లోని హాస్టల్‌లో ఉండి చదువుకున్నారు. దీంతో పాటు గ్రూప్-3లో కూడా 800 వ ర్యాంకు సాధించాడు. ఈ సందర్భంగా అతడిని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించారు.

చిన్నప్పటి నుంచే లక్ష్యం..



కుటుంబ సభ్యులతో అఖిలజారెడ్డి

న్యాల్‌కల్(జహీరాబాద్): చిన్నప్పటి నుంచి ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని లక్ష్యం పెట్టుకుంది. మొదటి ప్రయత్నంలోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. అంతటితో ఆగకుండా తన ప్రయత్నాన్ని కొనసాగిస్తూ ఎక్కెల్లి అఖిలజారెడ్డి గ్రూప్-1లో ప్రతిభ కనబర్చింది. మండల పరిధిలోని మిర్జాపూర్(బి) గ్రామానికి చెందిన ఎక్కెల్లి నిర్మల, జగనాథ్‌రెడ్డి దంపతులకు కుమారుడు, కూతురు ఉన్నారు. కుమారుడు ఎంబీబీఎస్ పూర్తి చేసి ప్రస్తుతం నీట్ పరీక్షకు సిద్ధమవుతున్నాడు. కూతురు అఖిలజారెడ్డి 10వ తరగతి వరకు పటాన్‌చెరులోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చదివింది. తరువాత హైదరాబాద్‌లోని ప్రైవేట్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ పూర్తి చేసింది. 2019లో మొదటి ప్రయత్నంలోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించింది. సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేస్తూ గ్రూప్స్‌కు ప్రిపేర్ అయింది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్ష రాసి 483.5 మార్కులతో రాష్ట్రంలో 125 ర్యాంక్, మల్టీ జోన్‌లో 50వ ర్యాంక్ సాధించింది. ఉద్యోగం సాధించడం సంతోషంగా ఉందని అఖిలజారెడ్డి పేర్కొంది. తన లక్ష్యం ఐఏఎస్ అని, ప్రజలకు సేవ చేయాలని ఆమె పేర్కొంది. ఉద్యోగానికి ఎంపిక కావడం పై ఆమె తల్లింద్రులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో స్వీట్లు పంచి పెట్టారు.

360వ ర్యాంకు సాధించిన సచిన్‌రెడ్డి



సచిన్ రెడ్డి

సిద్దిపేటజోన్: ఆదివారం విడుదలైన గ్రూప్-1 ఫలితాల్లో సిద్దిపేట యువకుడు సచిన్ రెడ్డి 360 ర్యాంక్ సాధించాడు. ఇటీవల విడుదలైన గ్రూప్-2 ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంక్, గ్రూప్-3 ఫలితాల్లో 23 ర్యాంక్ సాధించాడు. తాజాగా విడుదలైన గ్రూప్ వన్ ఫలితాల్లో ఆయన ఉత్తమ ప్రతిభ కనబర్చాడు. ఈ సందర్భంగా సచిన్ కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

ఉగాది కవితలు

విశ్వావసుకు స్వాగతం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట):
విశ్వావసుకు స్వాగతం..
స్వాగతం సుస్వాగతం
విశ్వావసు కిదె స్వాగతం
ఉరకలు వేసే ఉత్సాహం ఉగాది పండుగ పర్వదినం
ఆరు రుచుల సమ్మేళనం కష్ట సుఖాల సమాహారం
ఉగాది పచ్చడి విశేషం, పంచాంగ శ్రవణం పరమానందం
రాశిఫలాల రహస్యం, వసంత ఋతువు ఆగమనం
పచ్చని ప్రకృతి ప్రమోదం, కోకిల సుస్వర
రాగములు మావిచిగురుల ఘుమ ఘుమలు
స్వాగతం సుస్వాగతం విశ్వావసు కిదె స్వాగతం

– గణపతి ఇందిరా, సిద్దిపేట

ప్రకృతి పరవశమై నవ్వినట్లు



కొత్త పొద్దు పొడిచిందంటే, ఆశలకు
రెక్కలు తొడిగినట్లు
సూర్య కిరణం
తాకిందంటే, ఆశయాలకు వెలుగు అద్దినట్లు
నవ్య కాంతి ప్రసరించిందంటే, చీకటి
ప్రశాంతంగా తప్పుకున్నట్లు
కొత్త వెలుగు వికసించిందంటే, ప్రకృతి
పరవశమై నవ్వినట్లు
నూతన సంవత్సరం వచ్చిందంటే, జీవితములో మరో అడుగు
మొదలైనట్లు

– సుజాత ప్రసాద్, లచ్చపేట

మామిడి పూతలా కొత్త ఆశలు..



మామిడి తోరణాలు
తెలుగు లోగిళ్ల
శ్రీ విశ్వావసుకు స్వాగతం
పలుకుతున్నాయి
మామిడి పూతలా
కొత్త ఆశలు చిగురిస్తూ
కొత్త కుండలో షడ్రుచులు కలగలసిన
తీరుగా నూతన సంవత్సరాది ప్రతి ఒక్కరిలో
'విశ్వ'మంతటి వెలుగులు నింపాలని
తెలుగు మదినిండా ఈ విశ్వ'నామం
ఆశలు నింపాలని,
చెడును పారద్రోలి ఆశలు ఆశయాలను
వెంట తీసుకురావాలని శ్రీ విశ్వావసుని
కోరుతూ..స్వాగతం పలుకుదాం

– అనంతవరం సిద్ధిరామప్ప, గుండారెడ్డిపల్లి

సకల శుభములు కలగాలి..



కొత్త మావిచిగురు
కోకిల పాటలు,
ఆనందనందనం
అవనితెలుగు
ఉర్వినుగాదియె
ఉత్తమపండుగ,
కొంగొత్త యాశలు కోర్కులమరువ
షడ్రుచుల్, భక్ష్యాలు చవులూరు
తెలుగింట, పంచాంగ శ్రవణమౌ
పర్వదినము
కవి కోకిలలు పాడు కమ్మని పద్యాలు,
తెలుగు భాష ఘనత తేజరిల్ల
సకల జనులంత జగతిలో చల్లగాను,
శాంతి సౌభాగ్య ఆరోగ్య సంపదలను
కలిగి వర్ధిల్లవలెగాక చెలువ మీర, సకల
శుభములు కలుగాలి సత్వరమున

– తాడూరి అరుణాదేవి, హుస్నాబాద్

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య



మృతి చెందిన వేణుగోపాల్

చేగుంట(తూప్రాన్): భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో ఓ వక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని పోతాన్‌శెట్టిపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన బండారి వేణుగోపాల్(31) తన అవసరాల నిమిత్తం భార్య దీపిక పుస్తెలతాడును కుదువపెట్టి డబ్బులు తెచ్చుకున్నాడు. నెల రోజుల క్రితం దీపికతో పుస్తెలతాడు విషయంలో గొడవ జరగగా దీపిక పుట్టింటికే వెళ్లిపోయింది. దీంతో శనివారం రాత్రి తన గదిలో వేణుగోపాల్ ఉరివేసుకున్నాడు. ఆదివారం అతడిని నిద్రలేపేందుకు తల్లి వెళ్లి తలుపు తట్టగా తెరవలేదు. దీంతో స్థానికుల సాయంతో గది తలుపులు తెరవగా ఉరివేసుకొని మృతి చెంది ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి సుగుణమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

స్నానానికి వెళ్లి కాలువలో పడి..



మృతి చెందిన వ్యక్తి ఇర్బ ఎడకే

దౌల్తాబాద్ (దుబ్బాక) : స్నానానికి వెళ్లి ప్రమాదశాత్తు కెనాల్ కాలువలో పడి వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని ఇందుప్రియాల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీరామ్ ప్రేమ్‌దీప్ కథనం ప్రకారం... మహారాష్ట్ర నాందేడ్ జిల్లా మచ్చనూరు గ్రామానికి చెందిన ఇర్బ ఎడకే (45) తన భార్య పిల్లలతో రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన చింతకింది కనకరాజు ఇటుక బట్టీలో కూలీ పని కోసం రెండు నెలల క్రితం వచ్చాడు. ఆదివారం ఉదయం రామాయంపేట కెనాల్ కాలువలో స్నానానికి వెళ్లాడు. ప్రమాదశాత్తు అందులో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నీటి గుంతలో పడి వ్యక్తి గల్లంతు

తూప్రాన్: స్నానం కోసం వెళ్లి నీటి గుంతలో పడి వ్యక్తి గల్లంతైన ఘటన పట్టణంలోని కరీంగూడ వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం కథనం ప్రకారం... పటాన్‌చెరుకు చెందిన వడ్ల ప్రభాకర్ (45) అనే వ్యక్తి పట్టణ పరిధిలోని పోతరాజుపల్లికి చెందిన పల్లపు యాదగిరి వద్దకు మూడేళ్ల క్రితం కూలీ పనికి వచ్చి ఇక్కడే నివాసం ఉంటున్నాడు. ఉగాది సందర్భంగా స్నానం కోసం వెళ్లిన ప్రభాకర్ కరీంగూడ వద్ద నీటి గుంతలో పడి గల్లంతయ్యాడు. మృతదేహం కోసం గాలించినా లభించలేదని ఎస్ఐ తెలిపాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అడవి పంది అడ్డురావడంతో ఆటో బోల్తా

- ప్రమాదంలో ఒకరు మృతి
- ఉగాదికి ఇంటికి వస్తున్న క్రమంలో ఘటన

రామాయంపేట(మెదక్): ఉగాది పండుగకు ఆటోలో ఇంటికి వస్తున్న క్రమంలో అడవి పంది అడ్డురావడంతో బోల్తాపడి అక్కడిక్కడే వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం రామాయంపేట మండల పరిధిలోని సుతార్‌పల్లి గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... కామారెడ్డి జిల్లా మల్లుపల్లికి చెందిన భానుచందర్(21) హైదరాబాద్‌లో అద్దెకు ఆటో తీసుకొని నడుపుతుంటాడు. ఆటోలో సుతార్‌పల్లికి వస్తుండగా మార్గమధ్యలో అడవి పంది అడ్డు రావడంతో ఢీకొట్టాడు. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. తీవ్ర గాయాలైన భాను చందర్ ఘటనా స్థలంలోనే పడి ఉన్నాడు. ఉదయం పొలం దగ్గరకు వెళ్లే రైతులు గమనించి 108కి సమాచారం అందించారు. అక్కడికి వచ్చిన అంబులెన్స్ సిబ్బంది మృతి చెందినట్లు నిర్ధారించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతుడి వివరాలు గుర్తించి బంధువులకు సమాచారం అందించారు. సుతార్‌పల్లిలో ఉన్న తల్లిని సొంత గ్రామానికి తీసుకెళ్లేందుకు వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వైద్యుల నిర్లక్ష్యమే కారణమని బంధువుల ఆందోళన

తూప్రాన్: అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చిన రోగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇందుకు ఆసుపత్రి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని మృతుడి బంధువులు ఆరోపిస్తూ మృతదేహంతో ఆందోళనకు దిగారు. ఈ ఘటన మున్సిపల్ కేంద్రంలోని ఓ ప్రైవే ట్ ఆసుపత్రిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... శివ్వంపేట మండల కేంద్రానికి చెందిన చిప్ప యాదగిరి(55) కడుపునొప్పితో పట్టణంలోని రాఘవేంద్ర ఆసుపత్రికి శనివారం వచ్చాడు. చికిత్స నిర్వహించిన అనంతరం నొప్పి తగ్గడంతో వైద్యులు ఇంటికి పంపించారు. తిరిగి ఆదివారం ఉదయం మళ్లీ నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకొచ్చారు. మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో యాదగిరి మృతి చెందాడు. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబసభ్యులు సకాలంలో వైద్యం అందించకపోవడంతోనే చనిపోయాడని.. ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ శివానందం బాధితులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపజేశారు. ఆసుపత్రి యా జమాన్యం మృతుడి కుటుంబానికి ఆర్థిక సహా యం అందించేందుకు ముందుకువచ్చిందని కుటుంబ సభ్యు లు పేర్కొన్నారు. ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పెళ్లయిన రెండు నెలలకే..


భార్య అంటే ఇష్టం లేదని భర్త ఆత్మహత్య



చాకలి ప్రవీణ్(ఫైల్)

వట్‌పల్లి(అందోల్): భార్య అంటే ఇష్టం లేని భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన అందోలు మండల పరిధిలోని తాడ్మన్నూర్ గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. జోగిపేట ఎస్ఐ పాండు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి ప్రవీణ్(24)కు సదాశివపేట మండలం నిజాంపూర్ గ్రామానికి చెందిన సంజీవులు కుమార్తె మాధవితో రెండు నెలల క్రితం వివాహం జరిగింది. భార్య అంటే ఇష్టం లేని ప్రవీణ్ తరచు ఆమెతో గొడవపడేవాడు. ఆదివారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయి తన వ్యవసాయ పొలం వద్ద ఉన్న చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి వీరయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఒక్కో నిరసనకు ఒక్కో రిబ్బన్



సందేహాలకు, సంతాపాలకు, నిరసనలకు, అవగాహనలకు ఒక్కో సందర్భానికి ఒక్కో రిబ్బను వాడుతుంటాం. జేబుకు ధరించి నిరసన తెలుపుతాం. కొన్ని రకాల వ్యాధులు, వాటి పేరుకంటే కూడా రిబ్బన్ సింబల్‌తోనే పాపులర్ అయ్యాయి. ఆ సింబల్ చూడగానే వ్యాధిపై అవగాహనకు వచ్చేస్తాం. రిబ్బన్లతో రకరకాల రంగులు నలుపు, తెలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు ఇలా ఒక్కో రంగు ఒక్కో అంశాన్ని తెలియజేస్తుంది. ఈ నేపథ్యంలో ఏ రంగు రిబ్బను దేన్ని సూచిస్తుందో.. మీ కోసం సాక్షి ప్రత్యేక కథనం. వెల్దుర్తి(తూప్రాన్):

అవగాహన కార్యక్రమాలకు ప్రత్యేకం

- కొన్ని వ్యాధులు రిబ్బన్ సింబల్‌తోనే పాపులర్
- ఒక్కో రంగు ఒక్కో అంశం

నలుపు రంగు..



తమ డిమాండ్లను తెలియజేస్తూ నిరసన వ్యక్తం చేసినప్పుడు నలుపు రంగు రిబ్బన్ ధరిస్తారు. అలాగే మృతిచెందిన వారికి సంతాప సూచకంగా నివాళి అర్పించే సమయంలోనూ వీటిని ధరిస్తారు.

ఎరుపు..



ఎయిడ్స్, రక్త క్యాన్సర్, గుండె జబ్బులు, వ్యసనం, విపత్తు, ఉపశమనం తదితర వాటిపై నిర్వహించే సమావేశాల్లో ఎరుపు రంగు రిబ్బన్‌ను ధరిస్తారు. అలాగే అత్యవసర పరిస్థితులకు దీన్ని ఉపయోగిస్తారు.

నీలి..



ఈ రిబ్బన్‌ను సుమారు 100కి పైగా సందర్భాల్లో ఉపయోగిస్తారు. మానవ అక్రమ రవాణా, బెదిరింపులకు వ్యతిరేకంగా వీటిని ఉపయోగిస్తారు. జల సంరక్షణపై అవగాహన కల్పించే సమయంలోనూ వీటిని ఇస్తారు.

ఆకుపచ్చ..



మూత్రపిండాలు, కాలేయం, అవయవదానం, సురక్షిత వాహన చోదకం తదితర వాటికి ఆకుపచ్చ రిబ్బన్‌ను ఉపయోగిస్తారు. గ్లోబల్ వార్మింగ్‌ను తెలిపే సందర్భంలోనూ దీనిని ఉపయోగిస్తారు.

పసుపు..



యుద్ధ ఖైదీలు, తప్పిపోయిన వారి కోసం ఏర్పాటు చేసిన సమావేశాల్లో పసుపురంగు రిబ్బన్‌ను ధరిస్తారు. ఆత్మహత్యల నివారణకు, ఎముకల క్యాన్సర్ తదితర వాటి గురించి నిర్వహించే అవగాహన సదస్సుల్లో వీటిని ఉపయోగిస్తారు.

గులాబీ..

గులాబీ రంగు రిబ్బన్ మహిళల ఆరోగ్యానికి సంబంధించిన విషయాలను సూచిస్తుంది. ముఖ్యంగా ఆడవారిలో రొమ్ము క్యాన్సర్ పై అవగాహన కల్పించేందుకు దీనిని అంతర్జాతీయ గుర్తుగా ఉపయోగిస్తారు.

తెలుపు..

గర్భిణులు, మహిళలపై దాడులు జరిగినప్పుడు వాటికి వ్యతిరేకంగా నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో తెలుపురంగు రిబ్బన్ ధరిస్తారు. సురక్షిత మాతృత్వం, శాంతి, అహింసలను తెలుపుతూ జరిగే కార్యక్రమాల్లో వీటిని ఉపయోగిస్తారు.

18 రకాల రంగులు...

మానవ శరీరంలో వివిధ అవయవాలకు సోకిన క్యాన్సర్ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలకు వైద్యులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు 18 రకాల రిబ్బన్‌లను ఉపయోగిస్తారు. క్యాన్సర్ వ్యాధి సోకడానికి కారణాలు, వాటి లక్షణాలు, ట్రీట్‌మెంట్ విధానం ముందస్తుగా తీసుకోవల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు వీటిని ధరిస్తారు.